సాక్షి తిరుపతి

శుక్రవారం । 28 । మార్చి । 2025

I



52 ఏళ్ల వ్యక్తికి మహిళ గుండె

52 ఏళ్ల వ్యక్తికి మహిళ గుండెను అమర్చారు. ఈ ఘటన తిరుపతిలోని చిన్నపిల్లల హృదయాలయంలో చోటుచేసుకుంది. - IIలో



బియ్యం..మాయం!

డీలర్లు సుమారు 700 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాయం చేశారు. కార్డుదారులకు చుక్కలు చూపించేందుకు సిద్ధమయ్యారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
తిరుపతి	6-27	4-52
గూడూరు	6-22	4-47

న్యూస్‌రీల్

కల్తీ చేస్తే కేసులు



శుభం బన్సల్, జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలని, కల్తీ చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొందరు వ్యాపారులు కల్తీ ఆహారపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలుస్తోందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసులు నమోదు చేయడమే కాకుండా వారి వ్యాపార లైసెన్స్‌ను సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి, జగదీష్, నర్మదకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. తిరుపతి నగరంలో ఇలాంటి కల్తీ వ్యాపారం అధికంగా ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే పలువురు వ్యాపారులపై కేసులు నమోదు చేసి, రూ.1.38 లక్షల వరకు జరిమానా విధించారని గుర్తుచేశారు.

కండలేరును సందర్శించిన సీఈ



కండలేరు హెడ్ రెగ్యులేటరీని పరిశీలిస్తున్న సీఈ వరప్రసాద్

రాపూరు : కండలేరు జలాశయాన్ని గురువారం తిరుపతి సీఈ వరప్రసాద్ సందర్శించారు. హెడ్ రెగ్యులేటరీ, పికప్ ఏరు, స్పిల్‌వే, లోలెవల్ కాలువ, మట్టికట్టను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి కండలేరు స్థితిగతులు తెలుసుకున్నారు. కండలేరు జలాశయంలో 49.238 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. చెన్నై, తిరుపతి, నెల్లూరు జిల్లాల ప్రజలకు తాగు, సాగునీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట ఎస్సీ రాధాకృష్ణారెడ్డి, ఈఈలు విజయకుమార్ రెడ్డి, రామచంద్రమూర్తి, అనీల్‌కుమార్‌రెడ్డి, ధనుంజయులు, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం సొంత నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం ఎంపీపీ ఉప ఎన్నిక టీడీపీ నేతల దౌర్జన్యాలు, అరాచకాలకు పరాకాష్టగా నిలిచింది. అధికారుల తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని తెచ్చింది. పోలీసుల ప్రేక్షకపాత్ర విస్మయానికి గురిచేసింది. కోరం లేకపోయినా ఆరుగురు ఎంపీటీసీలతోనే ఎంపీపీ ఉప ఎన్నిక పూర్తిచేయడం విమర్శలకు తావిచ్చింది. ఇక తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని మూడు ఎంపీపీ స్థానాలతో పాటు, ఒక వైస్ ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ తిరిగి కైవశం చేసుకుంది.



రామకుప్పం: వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను అడ్డుకుంటున్న టీడీపీ నేతలను వారిస్తున్న పోలీసులు



రామకుప్పంలో పోలీసు బందోబస్తు మధ్య ఎంపీటీసీల తరలింపు

అరాచక పర్వం!

ఎంపీపీ ఎన్నికల్లో కూటమి నేతల దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను రానీయకుండా అడ్డంకులు
- పట్టనట్టు వ్యవహరించిన పోలీసులు
- రామకుప్పంలో పేట్రేగిపోయిన టీడీపీ మూకలు
- తిరుపతి రూరల్, సదుం, తవణంపల్లి ఎంపీపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవం



తవణంపల్లె ఎంపీపీ ప్రతాప్‌రెడ్డిని సత్కరిస్తున్న పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్



తిరుపతి రూరల్ మండల ఎంపీపీగా ఎన్నికైన మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు మాధవరెడ్డి, యశోదను సత్కరిస్తున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ మోహిత్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో గురువారం జరిగిన నాలుగు మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నికల్లో మూడింటిని వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం పరిధిలోని రామకుప్పం ఎంపీపీ స్థానాన్ని టీడీపీ అడ్డదారిలో దక్కించుకుంది.

అరాచకాలకు దిగుతూ..అడ్డంకులు సృష్టిస్తూ

సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం పరిధిలోని రామకుప్పం మండల ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నేతలు దౌర్జన్యకాండకు దిగారు. ఇక్కడున్న 16 ఎంపీటీసీ స్థానాలను గతంలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసింది. ఎంపీపీగా ఉన్న శాంతకుమారి మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్‌సీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి లాక్కుంది. ఒక ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించలేదు. మిగిలిన ఎనిమిది మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. వీరిని వెంటబెట్టుకుని ఎమ్మెల్సీ భరత్‌కృష్ణ ప్రత్యేక వాహనంలో మండల పరిషత్ కార్యాలయానికి బయలు దేరారు. గురువారం ఉదయం 9.50 గంటలకు వీ కోట పరిధిలోని కొత్తూరులోని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నివాసం నుంచి పోలీసు బందోబస్తు మధ్య బయలు దేరారు. మార్గమధ్యంలో ఎంపీటీసీల వాహనాన్ని టీడీపీ మూకలు పథకం ప్రకారం పత్రపల్లి క్రాస్, అన్నవరం క్రాస్, రాజుపేట క్రాస్‌లో అడ్డుకున్నారు. ఎంపీటీసీల వాహనానికి ముందు, వెనుక కార్లు, ట్రాక్టర్లు, టెంపో వాహనాలను అడ్డుపెట్టి ముందుకు కదలకుండా చేశారు. మరి కొన్నిచోట్ల చెట్లను నరికి రోడ్డుకడ్డంగా వేశారు. అడ్డుగా ఉన్న వాహనాలు, చెట్లను తొలగించుకుంటూ రామకుప్పం మండల పరిషత్ కార్యాలయం చేరేసరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. కేవలం 15 కి.మీ దూరంలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోవడానికి మూడు గంటలపైగా సమయం పట్టింది. ఆలోపు టీడీపీ ఆరుగురు ఎంపీటీసీలతో ఎంపీపీ ఎన్నికను పూర్తి చేయించుకుంది. చివరకు టీడీపీ బలపరిచిన రామకుప్పం ఎంపీపీగా సులోచన(ఉనిసిగనిపల్లె), వైస్ ఎంపీపీగా వెంకట్రామగౌడ్(విజలాపురం)ను ఎన్నుకున్నారు. టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, రామకుప్పం మండల పరిషత్ ఉప ఎన్నికపై ఎన్నికల కమిషన్‌కు విన్నవిస్తామని, అలాగే సుప్రీం కోర్టుకు కూడా వెళ్తామని ఎమ్మెల్సీ భరత్‌కృష్ణ స్పష్టం చేశారు.



తిరుపతి రూరల్ : ఓటు వేసేందుకు వీల్ చైర్‌పై వస్తున్న తిరుచానూరు-1 ఎంపీటీసీ సభ్యుడు

వైఎస్సార్‌సీపీ హవా

తిరుపతి రూరల్, సదుం, తవణంపల్లి మండల పరిషత్ అధ్యక్షులుగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రామకుప్పం మినహా మిగిలిన స్థానాల్లో వైఎస్సార్‌సీపీ బలపచిన అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- చంద్రగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామాతో తిరుపతి రూరల్ ఎంపీపీ ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 40 ఎంపీటీసీ స్థానాలు ఉంటే 39కి ఎన్నికలు జరిగాయి. అందులో 38 వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలుపొందారు. కేవలం ఒక స్థానంలోనే టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామాతో గురువారం ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఉప ఎన్నిక సజావుగా నిర్వహించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాస్థానం ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చారు. సీసీ కెమెరాల నిఘాలో ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఉప ఎన్నికలో 33 మంది ఎంపీటీసీలు పాల్గొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మూలం చంద్రమోహన్‌రెడ్డి(పేరూరు-1 సెగ్మెంట్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సదుం మండల పరిధిలో పది మంది ఎంపీటీసీలు ఉన్నారు. అయితే ఇందులో ఇద్దరు మరణించగా మిగిలిన ఎనిమిది మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన మాధవి(పాలమంద)ని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సదుం ఎంపీపీ మాధవి

- పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని తవణంపల్లి ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. ఇక్కడ 15 ఎంపీటీసీ స్థానాల్లో కేవలం ఒకే ఒక్క స్థానంలో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. ఉప ఎన్నికలో 14 మంది ఎంపీటీసీలు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన ప్రతాప్‌సుందర్ రాయల్‌రెడ్డి (మల్లకుంట)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- విజయపురం మండల ఉపాధ్యక్షురాలిగా కన్నెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- పెనుమూరు కో–ఆప్షన్ సభ్యురాలిగా నసీమాను ఎన్నుకున్నారు.



జన సంద్రంగా తూర్పుకనుపూరు



బంగారు చీరలో ముత్యాలమ్మ అమ్మవారు

జన జాతర

- తూర్పుకనుపూరుకు పోటెత్తిన భక్తులు

చిల్లకూరు: తూర్పుకనుపూరు ముత్యాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. సుమారు రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చినట్టు అంచనా. జాతరలో భాగంగా మూడో రోజు అయిన గురువారం ముత్యాలమ్మకు బంగారు చీరను అలంకరించారు. పోలేరమ్మ గుడివద్ద భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టట్టారు.

ఘనంగా యారా గురునాథస్వామి ఉత్సవం

జాతరలో అంతర్భాగమైన యారా గురనాథస్వామి గ్రామోత్సవం అట్టహాసంగా సాగింది. గంగమిట్టకు సమీపంలోని ఇసుక దిబ్బపై ఉంచిన గురనాథస్వామి ఉత్సవ విగ్రహం వద్ద పంబలోళ్లు చేసిన విన్యాసాలు ఆకట్టున్నాయి. ముందుగా గంగ పెట్టి వెళుతుండగా ఉత్సవం ముందు అక్కదేవతలు నడుస్తుండగా గురునాథస్వామి ఉత్సవాన్ని కొనసాగించారు. గణాచారి అమ్మవారి ఆలయం ముందు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోలేరమ్మకు జరిపే ఊయల సేవలో భక్తులు పాల్గొని తరించారు.

ఆంక్షలతో ఇక్కట్లు

పోలీసులు పలు రకాల ఆంక్షలు విధించడంతో భక్తులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. భక్తులు నిలువ నీడ లేక ఇబ్బంది పడ్డారు. జూదం, మద్యం పై మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకపోవడం గమనార్హం.



యారా గురనాథస్వామి గ్రామోత్సవం

యోగా అవార్డులకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించే ప్రధానమంత్రి యోగా అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి(డీఎస్‌డీఓ) ఎస్.సయ్యద్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, విస్త రణ, అవగాహనకు కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు అర్హులని తెలిపా రు. అర్హత ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోపు 'ఐఎన్ఎస్‌ఓవిఏటీఈఐఎన్‌డీఐఏ.ఎంవైజీఓవి.ఇన్/పీఎం–యోగా–అవార్డ్స్' అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్ట్‌ మృతి


ఆశిక్‌ (ఫైల్‌)

పాకాల : ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, స్కూటర్‌ ఢీకొన్న ఘటనలో స్కూటరిస్ట్‌ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. దామలచెరువు పంచాయతీ ఆజాద్‌నగర్‌కు చెందిన అల్లాఉద్దీన్‌ కుమారుడు ఆశిక్‌(20) ద్విచక్ర వాహనంలో దామలచెరువు కుక్కలపల్లి రైల్వేగేటు సమీపంలో పాకాల వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆశిక్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుదర్శన్‌ప్రసాద్‌ తెలిపారు.

హుండీ ఆదాయం రూ.28 లక్షలు


హుండీ లెక్కింపులో అధికారులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల్లోని హుండీల ద్వారా రూ.28 లక్షల ఆదాయం లభించినట్టు డీసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శ్రీవారి క్రేన్‌ మండపంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ కానుకలు 28 లక్షల 34 వేల 901 నగదుతోపాటు, బంగారం 80 గ్రాములు, వెండి 1.310 కిలోలు వచ్చినట్టు పేర్కొన్నారు. జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ సుధీర్‌, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

అధిక శబ్దం చేసే వాహనాలకు జరిమానా


వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్‌ సీఐ హరిప్రసాద్‌

తిరుమల: తిరుమలలో అధిక శబ్దాన్ని కలిగించే వాహనాలకు ట్రాఫిక్‌ సీఐ హరిప్రసాద్‌ జరిమానా విధించారు. ఆయన గురువారం వాహనాలను తనిఖీ చేశారు. అధిక శబ్దం చేస్తూ భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్న 35 వాహనాలను గుర్తించామన్నారు. ఒక్కొక్కరికి రూ.1000ల చొప్పున జరిమానా వసూలు చేశామన్నారు. తిరుమలలో అధిక శబ్దం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్‌ ఏటీసీ వద్దకు చేరింది. బుధవారం అర్ధరాత్రి వరకు 75,354 మంది స్వామిని దర్శించుకున్నారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.4.54 కోట్లు సమర్పించారు. టైంస్లాట్‌ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బియ్యం.. మాయం!



జిల్లాలో 700 టన్నులు గోవిందా!

- స్టాక్‌ చూపని డీలర్లు
- వచ్చే నెలకు బియ్యం లేదని తేల్చిచెప్పిన అధికారులు

జిల్లా సమాచారం

రేషన్‌ దుకాణాలు	1,457
కార్డుల సంఖ్య	6,03,000
సభ్యుల సంఖ్య	18.70 లక్షలు
ప్రతి నెలా బియ్యం	8,350 మెట్రిక్‌ టన్నులు

తిరుపతి అర్బన్‌: జిల్లాలో పేదలకు పంపిణీ చేసే రేషన్‌ బియ్యాన్ని కొందరు డీలర్లు మాయం చేశారు. ఆరు నెలల వ్యవధిలో స్టాక్‌ చూపించకుండా సుమారు 700 మెట్రిక్‌ టన్నుల వరకు బొక్కేశారు. ఆన్‌లైన్‌లో లెక్కలు సరిచేసుకుని ఏప్రిల్‌ నెలకు డీలర్లకు బియ్యం ఇచ్చేది లేదని, తమ వద్ద నిల్వ ఉన్న బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాలని సివిల్‌ సప్లయ్‌ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో బియ్యం బొక్కిన డీలర్ల నోట్లో వెలక్కాయ పడినట్టయ్యింది.

డీలర్ల వద్ద నో స్టాక్‌

సాధారణంగా రేషన్‌ డీలర్లకు వచ్చే బియ్యంలో ప్రతి నెల 80 నుంచి 85 శాతం కార్డుదారులకు పంపిణీ చేయగా.. మిగిలిన 15 నుంచి 20 శాతం బియ్యం స్టాక్‌ ఉన్నట్లు లెక్కలు చూపాలి. ఈ క్రమంలో డీలర్‌ వద్ద గత నెలలో ఎంత బియ్యం స్టాక్‌ ఉందో...ఆ బియ్యాన్ని తగ్గించి డీలర్‌కు ప్రతి నెలా రావాల్సిన మిగిలిన బియ్యాన్ని పంపడం పరిపాటి. అయితే గత ఆరు నెలలుగా డీలర్ల వద్ద మిగిలిన స్టాక్‌ బియ్యాన్ని క్షేత్రస్థాయి అధికారులు గుర్తించలేదు. ఇదే అదునుగా డీలర్లు తమ వద్ద ఉన్న మిగులు బియ్యాన్ని బొక్కేశారు.

మోసం బయటపడాల్సిందే

రేషన్‌ బియ్యాన్ని ఈ పాస్‌ యంత్రం ద్వారా ఇస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి నెలా ఆ డీలర్‌కు వచ్చిన స్టాక్‌ ఎంత... ఆ నెలలో ఎంత బియ్యం పంపిణీ చేశారు.. ఇంకా ఎంత బియ్యం నిల్వలున్నాయనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. గత ఆరు నెలలుగా అధికారులు నిద్రావ్యవస్థలో ఉండి ఇప్పుడు ఒక్కసారిగా స్టాక్‌ చూపిస్తున్నారు. దీంతో అంతా గందరగోళంగా మారింది. జీరో స్టాక్‌ చూపిస్తే ఆ డీలర్లు ఏప్రిల్‌లో ఒక్కరికి కూడా బియ్యం ఇవ్వలేరు. 20 నుంచి 30శాతం బియ్యం మాత్రమే వస్తే... కొంత మందికి మాత్రమే బియ్యం ఇవ్వడం సాధ్యమవుతుంది. మిగిలిన వారి పరిస్థితి ఏంటనేది ఇప్పుడు అంతుపట్టడంలేదు.

భారీగా తగ్గనున్న స్టాక్‌

జిల్లాలోని 240 నుంచి 245 షాపుల్లో 700 మెట్రిక్‌ టన్నుల బియ్యం మాయం చేసినట్లు చర్చసాగుతోంది. అయితే 200 నుంచి 210 దుకాణాలకు రావాల్సిన బియ్యంలో(100శాతంలో) 20 నుంచి 30శాతం బియ్యం మాత్రమే ఏప్రిల్‌ నెలకు ఇవ్వనున్నారు. 35 నుంచి 45 మంది డీలర్లకు జీరో మేల్కొన్నారు. తిరుపతి జిల్లాలో 700 మెట్రిక్‌ టన్నుల బియ్యాన్ని ఏప్రిల్‌ నెలకు తగ్గించాలని... ఏ డీలర్‌ వద్ద ఎంత స్టాక్‌ ఉందనే సమాచారాన్ని జిల్లా సివిల్‌ సప్లయ్‌ అధికారులకు పంపించారు. దీంతో జిల్లా అధికారులు అవాక్కయ్యారు.

కొత్త డీలర్ల వద్దే మోసాలు అధికం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో 300 మంది డీలర్లను తొలగించారు. వారి స్థానంలో తమ పార్టీలకు అనుకూలంగా ఉన్నవారిని నియమించారు. ఆయా దుకాణాల్లోనే బియ్యం స్టాక్‌ లేకుండా పోయిందని పలువురు చర్చించుకుంటున్నారు.

స్టాక్‌ వివరాలు ఇవ్వలేదు



మండలాల సివిల్‌ సప్లయ్‌ అధికారులు డీలర్ల వారీగా స్టాక్‌ వివరాలు ఇంకా పంపలేదు. దానిపై విచారణ చేపడుతున్నాం. ఏ డీలర్‌ వద్ద ఎంత స్టాక్‌ ఉండాలి.. ప్రస్తుతం ఎంత ఉంది అనే అంశాలపై ఆరా తీస్తున్నాం. తప్పు చేసి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. – శేషాచలం రాజు, జిల్లా సివిల్‌ సప్లయి అధికారి

చంద్రగిరిలో పోలీసుల జులుం

- వైఎస్సార్‌సీపీ నాయకులకు అడుగడుగునా అడ్డంకులు
- రెచ్చిపోయిన సీఐ
- సంబరాలు చేసుకోవద్దంటూ హుకుం


వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులను బలవంతంగా అరెస్టు చేస్తున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి: చంద్రగిరిలో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ విజయాన్ని జీర్ణించుకోని అధికార పార్టీ నేతలు పోలీసు అధికారుల అండదండతో వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి దిగారు. గురువారం జరిగిన తిరుపతి రూరల్‌ మండల ఎంపీపీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించింది. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. ఈ క్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సంబరాలకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైన నేతలు తొలుత టవర్‌క్లాక్‌ వద్ద టపాకాయలు కాల్చి సంబరాలకు పూనుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరామిరెడ్డి అడ్డుకున్నారు. దీంతో నాయకులు పార్టీ కార్యాలయం వద్ద టపాకాయలు కాల్చి సంబరాలకు శ్రీకారం చుట్టారు. సీఐ మరోసారి పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని సంబరాలను అడ్డుకున్నారు.

ఏయ్‌ లోపలెయ్యండి వీళ్లని!

పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై సీఐ జులుం ప్రదర్శించారు. కార్యాలయం వద్దకు చేరుకుని సంబరాలను అడ్డుకోవడమేగాకుండా 'ఏయ్‌..ఎవరు మిమ్మల్ని టపాకాయలు కాల్చమంది.. మర్యాదగా ఆపకపోతే మీ కథ తేలుస్తా.. ఏయ్‌ వీళ్లని లోపలెయ్యండి' అంటూ స్థానిక నేతలను బలవంతంగా సీఐ పోలీసు జీపులో ఎక్కించేందుకు యత్నించారు. అధికార పార్టీకి తొత్తులా చంద్రగిరి సీఐ వ్యవహరిస్తున్నారంటూ నాయులు మండిపడ్డారు. పార్టీ కార్యాలయం వద్ద పోలీసుల ఓవర్‌ యాక్షన్‌ చూసిన స్థానికులు ఉలిక్కి పడ్డారు. ఉగ్రవాదులు ఎవరైనా చంద్రగిరిలోకి వచ్చారా..? అన్నంతగా పోలీసులు వ్యవహరించడంతో స్థానికులు భయాందోళనలో మునిగిపోయారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఓర్వలేకే!

సాధారణంగా ఎన్నికల విజయాలు, నేతల పుట్టిన రోజు వేడుకలు ఇలా ఏ కార్యక్రమమైనా అన్ని రాజకీయ పార్టీల నాయకులు టవర్‌క్లాక్‌ వద్ద బాణ సంచా పేల్చి సంబరాలు జరుపుకోవడం పరిపాటి. అయితే గురువారం టవర్‌క్లాక్‌ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకోవడం, అక్కడి నుంచి పార్టీ కార్యాలయం ముందు దౌర్జన్యం చేయడంపై పార్టీ నేతలు మండిపడుతున్నారు. 9 నెలల్లోనే ప్రజల్లో చైతన్యం వచ్చిందని, తిరుపతి రూరల్‌ ఎంపీపీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ విజయాన్ని తట్టుకోలేక ఇలా పోలీసుల ద్వారా అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలు చేయిస్తున్నారంటూ మండిపడ్డారు. పోలీసుల బెదిరింపులకు తలొగ్గని పార్టీ నాయకులు కార్యాలయం ముందు సంబరాలు చేసుకుని, స్వీట్లు తినిపించుకున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు.

రహదారి సమస్యలకు పరిష్కారం చూపండి


కేంద్ర రోడ్డు మంత్రి నితిన్‌ గడ్కరీతో తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి పార్లమెంటు పరిధిలోని జాతీయ రహదారులకు సంబంధించిన సమస్యలు, ఇంట్రా మోడల్‌ బస్‌ స్టేషన్‌ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్‌ గడ్కరీతో భేటీ అయ్యారు. నాయుడుపేట, తూర్పు కనుపూరు జాతీయ రహదారి –71లో ప్యాకేజ్‌ 4, వరగలి క్రాస్‌, తూర్పు కనుపూరు జాతీయ రహదారి–516 డబ్ల్యూ ప్యాకేజ్‌ 2లో సర్వీస్‌ రోడ్లు, వెహికల్‌ అండర్‌ పాస్‌లు మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారుల్లో రూపొందించిన అండర్‌ పాస్‌ల డిజైన్‌ కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన గడ్కరీ ఈ రహదారులకు సంబంధించి మరోసారి పరిశీలన చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి ఇంట్రా మోడల్‌ బస్‌ స్టేషన్‌ నిర్మాణ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరగా డిజైన్‌లో స్వల్ప మార్పుల కారణంగా ఆలస్యమైందని త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రేణిగుంట, నాయుడుపేట మధ్య జాతీయ రహదారిపై నుంచి సర్వీసు రోడ్లకు ప్రవేశం లేదని, ప్రస్తుత డిజైన్‌ స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉందని ఆయనకు వివరించారు. అలాగే ఈ రహదారిపై శ్రీకాళహస్తి నుంచి ముచ్చువోలు, వెంకటగిరి రోడ్డును కలిపేందుకు యాక్సెస్‌ రోడ్డు, చావలి నుంచి గురప్రుతోట జంక్షన్‌ వరకు సర్వీస్‌ రోడ్డు విస్తరణ, చిల్లకూరు నుంచి గురప్రుతోట వరకు సర్వీస్‌ రోడ్డు విస్తరణ చేయాలని కేంద్ర మంత్రిని ఎంపీ అభ్యర్థించారు.

కంప్యూటర్‌ కోర్సుల్లో శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్‌ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో వేసవి శిబిరంలో భాగంగా జాబ్‌ ఓరియెంటెడ్‌ కంప్యూటర్‌ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు ప్రిన్సిపాల్‌ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. 45 రోజుల కాలవ్యవధితో కంప్యూటర్‌ ఫండమెంటల్స్‌, ఆఫీస్‌ ఆటోమేషన్‌ (ఎంఎస్‌ ఆఫీస్‌), 2 నెలల కాలవ్యవధితో సీ, సీ++, ఆటోక్యాడ్‌, 3 నెలల కాలవ్యవధితో హార్డ్‌వేర్‌, నెట్‌వర్కింగ్‌, మల్టీమీడియా, 6 నెలల కాలవ్యవధితో పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ డిప్లొమో ఇన్‌ అడ్వాన్స్‌డ్‌ మల్టీమీడియా అండ్‌ యానిమేషన్‌ కోర్సుల్లో తక్కువ ఫీజుతో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆయా కోర్సులకు కనీస విద్యార్హత 7వ తరగతి అని, ఈ సదవకాశాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99851 29995, 76718 87039 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అప్పలాయగుంటలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్‌: అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్‌ నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్‌ 1న మంగళవారం ఉదయం 8 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహిస్తారు. 4, 11, 18, 25వ తేదీల్లో శుక్రవారం సందర్భంగా ఉదయం 7 గంటలకు వస్త్రాలంకరణ సేవ, అభిషేకం జరుగనుంది. 9వ తేదీన ఉదయం 8 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, 22న శ్రవణ నక్షత్రం సందర్భంగా ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం జరుగనుంది.

విద్యుత్‌ షాక్‌తో రైతు మృతి


పొలంలో విగతజీవిగా పద్మయ్య నాయుడు


పద్మయ్య నాయుడు(ఫైల్‌)

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని వెంగమాంబాపురం గ్రామానికి చెందిన రైతు సాధనాల పద్మయ్య నాయుడు(35) విద్యుత్‌ షాక్‌తో మృతిచెందాడు. గురువారం పొలంలో సాగు నీరందించేందుకు మోటారు వేయగా విద్యుత్‌ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. మృతునికి భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

52 ఏళ్ల వ్యక్తికి మహిళ గుండె అమరిక



తిరుపతి తుడా: 52 ఏళ్ల వ్యక్తికి 45 సంవత్సరాల మహిళ గుండెను విజయవంతంగా అమర్చారు. తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయంలో గుండె మార్పిడి చికిత్సను వైద్యులు విజయవంతంగా చేపట్టారు. ఆస్పత్రి డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని ఆరుగురు వైద్యులు గురువారం రాత్రి 10.10 గంటలకు గుండె మార్పిడి చికిత్సను ప్రారంభించి.. శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగించారు.

సుష్మ బ్రెయిన్‌ డెడ్‌

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన సీహెచ్‌ సుష్మ (48) రమేష్‌ హాస్పిటల్‌లో ఈ నెల 23వ తేదీన అడ్మిట్‌ అయ్యారు. తలకు తీవ్ర గాయాలవ్వడంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయారు. వైద్యానికి స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా వారు అవయవ దానానికి ముందుకొచ్చారు.

పురుషుడికి మహిళ గుండె

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన 52 ఏళ్ల వ్యక్తి గుండె సంబంధిత వ్యాధితో గత కొన్నాళ్లుగా బాధపడుతున్నాడు. పరీక్షించిన వైద్యులు గుండె పూర్తిగా క్షీణించిందని నిర్ధారించారు. ఖరీదైన వైద్యం కావడంతో తెలిసిన వాళ్ల ద్వారా తిరుపతి శ్రీ పద్మావతి హృదయాలయానికి వచ్చారు. ఈ క్రమంలో సుష్మా కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు రావడంతో వివరాలు తెలుసుకున్న పద్మావతి ఆస్పత్రి వైద్యుల బృందం అక్కడికి చేరుకుంది. గుండెను సేకరించి గ్రీన్‌ చానల్‌ ద్వారా తిరుపతికి తరలించి 52 సంవత్సరాల వ్యక్తికి అమర్చారు.

దేశంలో రాజ్యాంగానికి పెనుప్రమాదం



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు, కార్యకర్తలు

తిరుపతి కల్చరల్‌: దేశంలో బీజేపీ సర్కార్‌ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి పెను ప్రమాదం ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దుయ్యబట్టారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈనెల 23న భగత్‌సింగ్‌ వర్ధంతి రోజు నుంచి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ జయంతి వరకు చేపట్టిన రాజ్యాంగ ప్రచార జాతాలో భాగంగా గురువారం తిరుపతి బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్‌ నుంచి సీపీఐ కార్యాలయం వరకు సీపీఐ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. హోంమంత్రి భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరచడం మంచిది కాదన్నారు. సీపీఐ నేతలు పీ.మురళి, విశ్వనాథ్‌, చిన్నం పెంచలయ్య, కత్తిరవి, బండి లక్ష్మీపతి, పద్మనాభరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ.ప్రసాద్‌, వైఎస్‌.మణి, ఎస్‌.శివ పాల్గొన్నారు.

కారిడార్‌ పనులు వేగవంతం


మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్‌

తిరుపతి అర్బన్‌: వైజాగ్‌–చెన్నై ఇండస్ట్రియల్‌ కారిడార్‌, చెన్నై– బెంగళూరు ఇండస్ట్రియల్‌ కారిడార్‌ పెండింగ్‌ పనులు వేగవంతం చేయాలని జేసీ శుభం బన్సల్‌ తెలిపారు. గురువారం ఆయన డీఆర్వో నరసింహులుతో కలసి అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇండస్ట్రియల్‌ కారిడార్‌కు సంబంధించి నీటి సరఫరా పనులు, రోడ్లు, విద్యుత్‌ తదితర అంశాలపై రెవెన్యూ, నీటిపారుదలతోపాటు పలు విభాగాలు సమ్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన బండి శ్రీహరిరెడ్డి

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అగరాల సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... బెంగళూరు విజయనగర్‌కు చెందిన బండి శ్రీహరిరెడ్డి(51) తన కుమార్తె లోకిత రెడ్డితో కలసి తిరుమల శ్రీవారి దర్శనార్థం గురువారం కారులో తిరుపతికి పయనమయ్యారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి అగరాల సమీపంలోని నారాయణ కళాశాల వద్ద నిద్రలోకి జారుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారు డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టుకుంటూ బెంగళూరు వైపు మార్గంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీహరి రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, లోకిత రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడింది. కేసు దర్యాప్తులో ఉంది.

హోషికియా కారు షోరూం ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవంలో షోరూం మేనేజింగ్‌ డైరెక్టర్‌

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఇరువారం ప్రాంతంలో గురువారం హోషికియా కారు షోరూం ప్రారంభోత్సవం చేశారు. ప్రత్యేక పూజలతో షోరూం మేనేజింగ్‌ డైరెక్టర్‌ జగన్నాథరెడ్డి ప్రారంభించారు. నూతనంగా విడుదలైన కియా సిరోస్‌ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ అన్ని కార్ల సేల్స్‌, సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభ ధర రూ.8.99 లక్షల నుంచి ఉందన్నారు. పెట్రోల్‌, డీజిల్‌, మాన్యువల్‌, ఆటోమేటిక్‌ వేరియంట్‌లలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చెరకు నిరంజన్‌, భారతి, హోషిమరెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌ వ్యాపారంపై అవగాహన


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

తిరుపతి అర్బన్‌: పొదుపు సంఘాల మహిళలు డిజిటల్‌ మార్కెటింగ్‌ దిశగా అడుగులు వేయాలని డీఆర్‌డీఏ పీడీ, జిల్లా స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ కన్వీనర్‌ శోభనబాబు తెలిపారు. గురువారం తిరుపతి డీఆర్‌డీఏ కార్యాలయంలో పొదుపు సంఘాలపై మహిళలకు ఆన్‌లైన్‌ వ్యాపారాలపై అవగాహన కల్పించారు. బుధ, గురువారాలు రెండు రోజుల పాటు జిల్లాలోని పలువురు మహిళలకు వ్యాపారాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఆర్‌డీఏ అడిషన్‌ పీడీ ప్రభావతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్‌.లోకనాథం, జిల్లా ఎంప్లాయ్‌మెంట్‌ అధికారి వెంకటరమణ, సైబర్‌ క్రైమ్‌ విభాగానికి చెందిన ఎస్‌ఐ పూర్ణిమ, డీఆర్‌డీఏ పీఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నూతన ప్రాజెక్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్‌: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ విభాగం కార్య నిర్వాహక జిల్లా సంచాలకులు హరినాథ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మైనారిటీ ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, బౌద్ధులు, పారశీకుల అర్హులని, ఈ పథకం కింద గరిష్టంగా ప్రాజెక్టు వ్యయ పరిమితి రూ.50లక్షలు, సేవా రంగంలో అయితే రూ.20లక్షలని, ప్రాజెక్టు విలువలో 15 నుంచి 35 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. 18ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా ఖాదీ బోర్డు, ఖాదీ–గ్రామీణ పరిశ్రమల కమిషన్‌, బ్యాంక్‌ వారితో సంప్రదించి స్కోరింగ్‌ విధానం ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. తయారీ రంగంలో రూ.10 లక్షలు పైబడిన ప్రాజెక్టులు, సేవా రంగంలో రూ.5 లక్షలు పైబడిన ప్రాజెక్టుల స్థాపనకు అభ్యర్థులు కనీసం 8 వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్నవారు kivconline. gov. in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, కుల ధ్రువీకరణతోపాటు ఆధార్‌ కార్డ్‌ జెరాక్స్‌లు, పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలు జతపరచాలని తెలియజేశారు.

పరీక్షల్లో కాపీకొట్టనివ్వలేదని..

తిరుపతి అర్బన్‌: పిచ్చాటూరు పదోతరగతి పరీక్ష కేంద్రంలో కాపీ కొట్టనివ్వలేదని ఓ ఉపాధ్యాయుడికి ఆకతాయిల నుంచి బెదిరింపులకు దిగినట్టు డీఈవో కేవీఎన్‌ కుమార్‌ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మురుగేశన్‌ అనే ఎస్జీటీ (శ్రీకాళహస్తి మండలం రామాపురం స్కూల్‌) గురువారం పదోతరగతి లెక్కల పరీక్ష నిమిత్తం పిచ్చాటూరు పరీక్ష కేంద్రంలో డ్యూటీ చేశారన్నారు. పరీక్ష అనంతరం ఉపాధ్యాయుడు ఇంటికి వెళుతున్న సమయంలో కీలపూడి గ్రామ సమీపంలో ఆ ఉపాధ్యాయుడిని అడ్డగించి ఆకతాయిలు బెదిరింపులకు పాల్పడినట్టు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

ఉన్నత లక్ష్యంతో ఉజ్వల భవిత


జ్యోతి ప్రజ్వలన చేసి వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, కళాశాల అధినేతలు

తిరుపతి కల్చరల్‌: పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించినప్పుడే ప్రతి విద్యార్థి జీవితం ఉజ్వల భవిషత్‌ అవుతుందని, ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని డీఆర్‌డీవో పూర్వ చైర్మన్‌ సతీష్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సి గొల్లపల్లి సిద్ధార్థ ఇంజినీరింగ్‌ కళాశాల 16వ వార్షికోత్సవాన్ని గురువారం మహతి కళాక్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వార్షిక వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా ప్రస్తుతం మన దేశం అగ్రరాజ్యాలతో సమానంగా ఉందన్నారు. ప్రత్యేకించి డిఫెన్స్‌, అంతరిక్ష పరిశోధనల్లో ముందంజలో ఉందని తెలిపారు. విద్యార్థులను ఇన్‌స్పైర్‌ చేయడానికి పేదరికం స్వయం కృషితో సొంత కంపెనీలను లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. ఫలితంగా ఎందరో విజయం సాధించిన వ్యక్తుల గురించి వివరించారు. అనంతరం కళాశాల చైర్మన్‌ వై.కొండారెడ్డి మాట్లాడుతూ మేలైన సమాజ స్థాపనకు ఉపాధ్యాయుడు ఎంత ముఖ్యమో వివరించారు. కళాశాల కార్యదర్శి వై.ఆనందరెడ్డి, వైస్‌ చైర్మన్‌ వై.విజయ్‌రెడ్డి, ప్రిన్సిపల్‌ రాజశేఖర్‌ ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యప్రదర్శన